

ఉపాధిలో 'చిలక్కొట్టుడు'!

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. కూలీలకు బిల్లులు చెల్లింపులో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు తెర తీశారు. -10లో



కేంద్రీయ విద్యాలయానికి ముహూర్తం ఖరారు

మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషి ఫలించింది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.100
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1107 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఇక రుణాలన్నీ ఆన్‌లైన్‌లో మంజూరు

బి.కొత్తకోట: మహిళా సంఘాలకు మంజూరు చేసే రుణాలన్నీ ఇకపై డిజిటల్ విధానంలో ఉంటాయని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి రుణాల మంజూరుకు సంబంధించి వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. మొదట సీసీ లాగిన్‌లో రుణానికి సంబంధించిన వివరాలు నమోదు చేశాక ఏపీఎం లాగిన్‌కు.. అక్కడినుంచి బ్యాంక్ మేనేజర్ లాగిన్‌కు వెళుతుందన్నారు. బ్యాంకు మేనేజర్లు వీటిని పరిశీలించి ఎవరికి ఎంత రుణం మంజూరు చేయాలి అన్నది నిర్ణయిస్తారన్నారు. ఇకపై సంఘమిత్రలు, సభ్యులు బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.వార్షిక జీవనోపాదులు, రుణ ప్రణాళిక మొత్తం ఆన్‌లైన్‌లో ఉంటుందని చెప్పారు. ఏసీ గంగాధర్, ఏపీఎం రాజేశ్వరీ, సీసీలు,సంఘమిత్రలు పాల్గొన్నారు.

3 నెలల్లో లక్ష్యం సాధించాలి

కలికిరి: ఉపాధి సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యం మేరకు కూలీలకు పని దినాలు కల్పించాలని ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం అన్నారు. గురువారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో కలికిరి క్లస్టర్ పరిధిలోని సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల లక్ష్యం మూడు నెలల్లో సాధించాలని, ఫాంపాండ్‌ల లక్ష్యాలను జూన్ నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో హార్టికల్చర్ ప్రోగ్రాంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి, ప్రతి రైతు ఉద్యాన పంటల సాగు చేపట్టేలా చూడాలన్నారు.

ఉపాధి కల్పనలో శ్రద్ధ చూపండి



పనులు పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

మదనపల్లె: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించే విషయంలో శ్రద్ధ చూపాలని డ్వామా పీడీ వెంకటరత్నం అధికారులను సూచించారు. గురువారం ఆయన మదనపల్లె రూరల్ మండలంలోని వలసపల్లె పంచాయతీలో జరుగుతున్న ఫాంపాండ్ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. కూలీ ఎంత వస్తుంది, ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫాంపాండ్ పనులు నాణ్యత ఉండేలా చూడాలన్నారు. కూలీలకు పనులు కల్పించడమే కాకుండా వాటి ద్వారా ప్రయోజనం కలగాలని కోరారు. ఇచ్చిన పనుల లక్ష్యాలను సత్వరమే పూర్తి చేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఎంపీడీఓ తాజ్‌మన్సూర్, ఏపీఓ చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలపై చిన్నచూపు

- అలుపెరుగని పోరాటం చేస్తున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రోజుకొక తరహాలో వినూత్న నిరసన
- 25 రోజులుగా సమ్మెలోనే..
- ప్రజలకు వైద్య సేవలు దూరం



కలెక్టరేట్ గేటు ఎదురుగా ఒంటి కాలిపై నిలబడి యోగా చేస్తూ నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సాక్షి రాయచోటి: ఆక్రోశం అడుగడుగునా కనిపిస్తోంది..చేసిన పాపం లేదు...చెడుకు పోనే లేదు...కానీ వారు మాత్రం అన్యాయమై పోతున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం అనుక్షణం పరితపించే వైద్య విభాగానికి సంబంధించిన వారికి కష్టాలు మొదలయ్యాయి. బాబు...మా మొర ఆలకించండి....మేమెన్నో కష్టాలు పడుతున్నామంటూ రోజుల తరబడి ఉద్యమబాట పట్టినా పట్టించుకునే పరిస్థితే లేదు. గత కొన్ని రోజులుగా ఆందోళన బాటపట్టారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌ఓలు). వారి వేదన చూసి కూడా కూటమి సర్కార్ కనికరించకపోవడం గహనార్హం.

సమస్యలపై పోరుబాట

జిల్లాలో వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో ఆయుష్మాన్ భారత్ కింద సుమారు 375 మంది పనిచేస్తున్నారు.ప్రభుత్వం పెండింగ్ సమస్యలతోపాటు ఈపీఎఫ్, ఇతర ఉద్యోగుల మాదిరిగా భద్రత ను కల్పించాలని కోరుతున్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంటు, ఎక్స్‌గ్రేషియా, ట్రాన్స్‌ఫర్, మాతృత్వ సెలవులు ఇలా అన్నింటిని అమలు చేయాలని ఉద్యమబాట పట్టారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు తెలిసినా తెలియనట్లు ఉన్నాయే తప్ప వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒక్క అన్నమయ్య జిల్లాలోనే కాదు...రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒక ఆందోళన కొనసాగిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

25 రోజులుగా ఉద్యమం

జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కింద పనిచేస్తున్న 375 మంది ప్రతిరోజు రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రత్యేకంగా కలెక్టరేట్ మెయిన్ గేటు పక్కన టెంటువేసి వినూత్న నిరసనలు చేపడుతున్నారు. ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని, తమ డిమాండ్లను నెరవేర్చి న్యాయం చేయాలని ఏదో ఒక కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఇన్ని చేస్తున్నా ప్రభుత్వంలో స్పందన కలగకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండు వేసవిలో నిత్యం శిబిరంలో కూర్చొంటూ తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు. ఏది ఏమైనా 25 రోజులుగా ఉద్యమం చేస్తున్నా ఎటువంటి చిన్నపాటి స్పందన లేకపోవడంతో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు

- ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి
- పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలి
- ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలి
- క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలి
- నిర్దిష్టమైన జాబ్‌చార్టు అందించాలి
- ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయింపు ఇవ్వాలి
- హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్లు, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు తదితరాలు అమలు చేయాలి.

సర్వీసు రెగ్యులర్ చేయాలి



ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తయిన ప్రతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సర్వీసు రెగ్యులర్ చేయాలి .25 రోజుల నుండి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవటం బాధాకరం.ప్రభుత్వం వెంటనే స్పందించి మా పైన సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలి.

– బి.ప్రసాద్‌బాబు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

సానుకూల నిర్ణయం తీసుకోవాలి



ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న అన్ని కేడర్ ఉద్యోగులకు జీతం పెంచి మాకు మాత్రమే పెంచక పోవటం అన్యాయం. కావున ప్రభుత్వం వెంటనే మా నాయకులతో చర్చించి మంచి నిర్ణయం తీసుకోవాలి. మాకు 23 శాతం వేతనం పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం

– కె.షాహిద, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, కలికిరి

ఆర్థికంగా ఆదుకోవాలి



ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా పట్ల ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలి. గత నెల వేతనం కూడా చెల్లించి మమ్మల్ని ఆర్థికంగా ఆదుకోవాలి.

– కె.నాగరాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

ఆ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలి



ప్రభుత్వం తీసుకున్న హెడ్ కోర్టర్స్ స్టే, రాత్రి 8 గంటల వరకు అటెండెన్స్ విధానాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం. 80 శాతంకు పైగా పని చేస్తున్న మహిళలు రాత్రి పూట ఊరి బయట వెళ్లడం ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ విషయంగా ప్రభుత్వం ఆలోచించి జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలి.

– రెడ్డెమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

28న ఐదువేల మందితో యోగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర–2025లో భాగంగా ఈనెల 28న ఒకే ప్రాంతంలో ఐదువేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర–2025 మాసోత్సవాల నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ తదితర అంశాల్లో చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. జిల్లా నుంచి పది లక్షల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

- జిల్లాలోని 500 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో తడి, పొడి చెత్తలను విడిగా సేకరించాలని, ఈ దశగా ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. జిల్లాలోని అన్ని బస్టాండ్‌లలో మెరుగైన వసతులు కల్పించాలని తెలిపారు. బస్టాండ్ పరిసరాలలో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ బాగుండాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్‌రావు, సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గండి క్షేత్రం.. భక్తజన సందోహం



విశేష అలంకరణలో గండి వీరాంజనేయ స్వామి



భక్తులతో గండి అంజన్న ఆలయం

చక్రాయపేట: హనుమజ్జయంతి సందర్భంగా గురువారం గండి వీరాంజనేయ స్వామి సన్నిధి జైశ్రీరామ్ అనే రామనామ స్మరణతో మారు మోగింది. గండిక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో ప్రధాన,ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్,రాజగోపాలాచార్యులు లు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ముగిసిన వేడుకలు: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి వేడుకలు గురువారంతో ముగిశాయి.చివరి రోజున త్రికాల ఆరాధన,పంచసూక్త హోమం,మన్యు సూక్త హోమం,ఆంజనేయ స్వామి మూలమంత్ర తదితర హోమాలు నిర్వహించారు.

ఘనంగా శోభాయాత్ర: గండి వీరాంజేయ స్వామి సన్నిధి నుంచి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది. చక్రాయపేటలో వెలసిన శ్రీవేంకటేశ్వర,రాచరాయస్వామి ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర గండి నుంచి అద్దాలమర్రి, కుమార్లకాల్వ, చిలేకాంపల్లెల మీదుగా చక్రాయపేటలోని ఆలయాల వద్ద ముగించారు.ఆలయాల చైర్మన్ మోపూరి రామాంజనేయ రెడ్డి,మాజీ చేర్మెన్‌లు చక్రపాణిరెడ్డి, ఓబుళరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గూడు.. మహాగోడు

- 35ఏళ్లుగా ఎదుగుబొదుగు లేకుండా ఉండిపోయిన ప్లాట్స్
- టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో మహానాడు నిర్వహణ
- ఇదివరకే ఆక్రమణకు సిద్ధమైన హౌస్‌బిల్డింగ్ సొసైటీ కార్యాలయంపై దాడి
- ప్రస్తుతం ప్లాట్స్ చదును చేసిన తెలుగుదేశం పార్టీ
- యథావిధిగా స్థలాలు దక్కుతాయా? హైరానాలో అయ్యవార్లు



మహానాడు సభకోసం చదును చేసిన టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థలం

సాక్షి ప్రతినిధి, కడప: సొంతింటి కల ఓ వరం. అలాంటి వరం నెరవేర్చుకునేందుకు 35ఏళ్లుగా టీచర్లు ఎదురుచూస్తున్నారు. ఎదుగుబొదుగు లేని ప్లాట్స్ డెవలప్‌మెంట్ చేసుకోవాలనే దిశగా సంఘటితమయ్యారు. హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా సంక్రమించిన ప్లాట్‌లో ఇళ్లు కట్టుకోవాలని భావిస్తున్న సమయంలో ఒక్కసారిగా టీడీపీ గద్దలు వాలిపోయాయి. బెదిరించి స్వాహా చేయాలనే దిశగా అడుగులు పడ్డాయి. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహిస్తూ హద్దులు, కేటాయింపు రాళ్లు నామరూపాలు లేకుండా చేశారు. మహానాడు తర్వాత యథావిధిగా హౌస్ బిల్డింగ్ సొసైటీకీ అప్పగిస్తారా? ముప్పు తిప్పలు పెడతారా? అన్న సందిగ్ధంలో అయ్యవార్లు ఉండిపోయారు.

- 1989లో టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ 88 ఎకరాలు కడప రూరల్ పబ్బాపురం గ్రామ పరిధిలో కొనుగోలు చేసింది. అందులో 1430 మంది ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఆ భూమి వైపు ఎవరూ కన్నెత్తి చూసే పరిస్థితి లేదు, కాలక్రమేణ రింగ్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దాదాపు 17 ఏళ్ల తర్వాత 2006లో తమ సమ్మతి లేకుండా కొనుగోలు చేశారని శోత్రియందారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు మరో పదేళ్ల తర్వాత తీర్పు వెలువరించింది. టీచర్స్ అప్పీల్‌కు వెళ్లిన పిదప 1/3 వంతు శోత్రియం హక్కుదారులకు ఇవ్వాలని ఆదేశించింది. కేవలం 20 ఎకరాలకు మాత్రమే శోత్రియందారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేశారని, అందులో 1/3 వంతు ఇవ్వాల్సి ఉంటుందని టీచర్లు వివరిస్తున్నారు. ఈలెక్కన దాదాపు 6.66 ఎకరాలు మాత్రమే అప్పజెప్పాల్సి ఉంటుంది. ఇది అలా ఉండగా 2021లో శుభకీర్తి డెవలపర్స్ పేరిట 20 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయడంపై వివాదం తెరపైకి వచ్చింది.

రికార్డులేకున్నా రిజిస్ట్రేషన్

పబ్బాపురం టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పరిధిలో 20 ఎకరాలకు రైత్వారీ పట్టా ఒకటి వెలుగులోకి తెచ్చారు. ఆ రైత్వారీ పట్టాకు చెందిన భూమి వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో లేదు. అయినప్పటికీ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శుభకీర్తి డెవలపర్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈమొత్తం వ్యవహారాన్ని హౌస్ బిల్డింగ్ సొసైటీ వెలుగులోకి తెచ్చింది. అప్పటి జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ జిల్లా రిజిస్ట్రార్, చింతకొమ్మదిన్నె తహసీల్దార్, టీచర్లతో కలిపి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తే 2021లో రైత్వారీ పట్టా కేటాయింపునకు చెందిన ఎలాంటి రికార్డులు అందుబాటులో లేవని స్పష్టమైంది. నకిలీ రైత్వారీ పట్టా పుట్టించినట్లు తేటతెల్లమైంది. వెబ్‌ల్యాండ్‌లో లేకపోయినా శుభకీర్తి డెవెలపర్స్‌కు రిజిస్ట్రేషన్ కావడం విశేషం. కాగా ఈ శుభకీర్తి డెవెలపర్స్ మైదుకూరు టీడీపీ నేత సూట్‌కేసు కంపెనీగా గుర్తించారు. ఆపై ఉపాధ్యాయ దినోత్సవం రోజున హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేయగా, గుర్తుతెలియని వ్యక్తులు అప్పట్లో కార్యాలయంపై దాడి చేశారు.

35ఏళ్లుగా నిరీక్షణ...

టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కొనుగోలు చేసిన భూమిని చేజిక్కించుకోవాలని కొందరు అక్రమార్కులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆపై దౌర్జన్యం చేస్తున్నారు. ఇది వరకూ అనేక పర్యాయాలు ఉన్నతాధికారుల దృష్టికి అయ్యవార్లు తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించినా టీచర్లకు 35ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. తాజాగా అవే స్థలాలపై మహానాడు నిర్వహిస్తుండడంపై టీచర్లు పిడుగు పడ్డట్లుగా భావిస్తున్నారు. గౌరవంగా టీచర్ల ప్లాట్లు అప్పగిస్తారా? ముప్పు తిప్పలు పెట్టి వేధిస్తారా? అనే భావన అనేక మంది వ్యక్తం చేస్తున్నారు. టీచర్లు సొంత డబ్బుతో కొనుగోలు చేసిన స్థలాన్ని ఇప్పటికీ దక్కించుకోలేని దుస్థితి ఉంది. తెలుగుతమ్ముళ్లకు చిత్తశుద్ధి ఉంటే వివాదాలు పరిష్కరించి, టీచర్లకు మద్దతుగా నిలవాల్సి ఉంది. ఇదివరకే మైదుకూరు టీడీపీ నేత బినామీ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకునే ఎత్తుగడ నేపథ్యంలో, ఉపాధ్యాయులు లోలోన మదనపడిపోతున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా మంత్రి మండిపల్లి రామప్రసాదరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిలు బాధ్యతగా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. టీచర్ల స్థలాల్లో మహానాడు నిర్వహించిన తర్వాత అంతే బాధ్యతగా న్యాయం చేసేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. ఏమేరకు బాధ్యత తీసుకుంటారో వేచిచూడాల్సిందే!

మహా అసంతృప్తి



- మదనపల్లె మినీ మహానాడులో వర్గపోరు
- మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, సీనియర్లు దూరం
- పార్టీ కమిటీలు ప్రకటించకపోవడంపై క్యాడర్‌లో నిరుత్సాహం
- ఆ ముగ్గురు అనుచరులతో రహస్యంగా సిద్ధం చేశారంటున్న నేతలు
- కార్యకర్తలు చెప్పినట్టుగా ఉద్యోగుల బదిలీలు చేస్తామని ఎమ్మెల్యే వివాదాస్పద ప్రకటన



మినీమహానాడులో పాల్గొన్న టీడీపీ నాయకులు

మదనపల్లె: మదనపల్లె నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడులో వర్గపోరు బట్టబయలైంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గెలిచిన తర్వాత పార్టీ కోసం పనిచేసిన శ్రేణులు, సీనియర్లను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పార్టీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేకు ఆ వర్గపోరు ఏ స్థాయిలో ఉందో ఈ సభతో వెల్లడైంది. స్థానిక సంతగేటు సమీపంలోని ఫంక్షన్‌హాలులో నిర్వహించిన మినీ మహానాడుకు ఆశించిన మేరకు పార్టీ శ్రేణులు హాజరుకాలేదు. టీడీపీలో సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు రాటకొండ శోభ బాబురెడ్డి, దొమ్మలపాటి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాటకొండ గుర్రప్పనాయుడు, శ్రీరాం చినబాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ భవానీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి వై.దొరస్వామినాయుడు, బోయపాటి రఘు, పలువురు మాజీ కౌన్సిలర్లు, పార్టీ మాజీ మండల అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులు మినీ మహానాడు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో ఎమ్మెల్యే వర్గంతోనే నిర్వహించారు. హాజరుకాని వారిలో గత ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశించిన కొందరు నేతలు కూడా ఉన్నారు. ఫలితంగా సభ మొక్కుబడిగా ప్రారంభించి పూర్తి చేసినట్టయ్యింది. ఎమ్మెల్యే వర్గం మినహా మిగతా వర్గాలు హాజరుకాకపోవడంతో టీడీపీలో వర్గపోరు తారాస్థాయి చేరినట్టయ్యింది. ఇప్పటికే ఈ వర్గాలు ఎమ్మెల్యేతో ఉప్పు–నిప్పుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే తనపట్ల పార్టీలో వ్యతిరేకత లేదని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. సభలో మాట్లాడిన ఆయన తనకు ఎవరిపైనా వ్యతిరేకత లేదని, అందరినీ కలుపుకుని వెళ్లేందుకు ప్రయత్నించానని చెప్పుకున్నారు.

కమిటీలపై ఆగ్రహం

మినీమహానాడులో పార్టీ మండల, పట్టణ కమిటీల ఎంపికపై చర్చించి ప్రకటించాల్సి ఉంది.అయితే ఎమ్మెల్యే ఈ విషయాన్ని దాటవేసి అధిష్టానం నిర్ణయం మేరకు ఎంపిక ఉంటుందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడంపై టీడీపీ సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వర్గీయులు ముగ్గురు మండలాలు, పట్టణానికి సంబంధించిన గ్రామ, వార్డు కమిటీలు, మండల, మున్సిపల్ స్థాయి కమిటీల ఎంపికను రహస్యంగా పూర్తి చేశారని అంటున్నారు. ఏకపక్షంగా ఎమ్మెల్యే వర్గీయులకే ప్రాధాన్యమిచ్చి ఇంకా కమిటీలు వేయలేదంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ కమిటీల్లో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానికి చోటులేకుండా ఏకపక్షంగా చేసుకుని అధిష్టానం ఎంపిక చేస్తుందని ఎమ్మెల్యే చెప్పడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ల కినుక

పార్టీ విధానాల మేరకు మినీమహానాడు సాగలేదని సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ విధి విధానాల మేరకు నియోజకవర్గ పార్టీ స్థితిగతులు, నాయకుల అభిప్రాయాలపై చర్చించాలి. పార్టీ కోసం శ్రమించిన వారిని గుర్తించి సత్కరించాలి. అయితే ఇవేమి లేకుండానే ప్రసంగాలతో ముగించారు. మినీమహానాడులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టౌన్‌బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ శివప్రసాద్, నాదేళ్ల శివ, ప్రశాంత్, ఎస్ఏ.మస్తాన్, మార్పూరి సుధాకర్‌నాయుడు, తులసీ, రామకృష్ణ, మధుబాబు పాల్గొన్నారు.

బదిలీలు కార్యకర్తల ఇష్టం

నియోజకవర్గంలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు టీడీపీ కార్యకర్తలు చెప్పినట్టుగానే చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించడం వివాదాస్పదమైంది. పార్టీ కార్యక్రమంలో ఉద్యోగుల బదిలీల విషయం ప్రస్తావించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల బదిలీల వ్యవహారం టీడీపీ కార్యక్రమంగా చేస్తారా అని పలువురు నిలదీస్తుండగా, మరోవైపు ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నంలో ఇలా ప్రకటించి ఉంటారన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ప్రకటన సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇకపై టీడీపీ కార్యకర్తలు తమపై పెత్తనం చెలాయిస్తారా అని చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

స్తంభాన్ని ఢీకొని స్కూటరిస్టు మృతి



స్తంభాన్ని ఢీకొన్న బైక్..
పక్కనే మృతి చెందిన ప్రభుకుమార్

చాపాడు : మండలంలోని మైదుకూరు– ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని కొత్తపల్లె ప్రభుకుమార్(41) గురువారం మృతి చెందారు. మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన ప్రభుకుమార్ లింగాపురం వెళ్లి తిరిగి బైక్‌లో వస్తున్నారు. పల్లవోలు సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమ సమీపంలో ప్రమాదశాత్తూ బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రభుకుమార్‌కు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

మావోయిస్టులపై హత్యాకాండను ఆపండి

– వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్



మదనపల్లె రూరల్ : ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండను ఆపి వారితో చర్చలు జరపాలని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే)పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 25మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో హత్యచేయడాన్ని ఖండించారు. కొన్ని నెలలుగా మధ్య భారత అడవుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో భారత ప్రభుత్వం హత్యాకాండ కొనసాగిస్తోందన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో ప్రభుత్వ బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు మరో 25మందికి పైగా మృతి చెందడం బాధాకరమన్నారు. శాంతిచర్చల కోసం మావోయిస్టుపార్టీ కేంద్రప్రభుత్వాన్ని పదే పదే కోరిందని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ని ఆపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మేధావులు, ప్రజాస్వామిక వాదులు కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నా బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోగా, మావోయిస్టులపై నరమేధాన్ని తీవ్రతరం చేసిందన్నారు. అడవి నుంచి ఆదివాసీలను ఖాళీ చేయించి, అడవిలో సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకే ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని కోరారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు, మావోయిస్టు పార్టీ సభ్యులకు వీసీకే పార్టీ తరపున విప్లవజోహార్లు తెలుపుతున్నామన్నారు.

మదనపల్లె కేంద్రీయ విద్యాలయానికి

ముహూర్తం ఖరారు

- ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి
- తరగతుల ప్రారంభానికి త్వరలో నోటిఫికేషన్
- భూమి, భవనాలను కేవీఎస్ అధికారులకు అప్పగించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కేవీఎస్ అధికారులు



కేంద్రీయ విద్యాలయం స్థలపత్రాలను అందజేస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్: పట్టణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కృషి ఫలించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మదనపల్లెకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం(కేవీఎస్) ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రజలకు అందుబాటులోకి రానుంది. కేంద్రీయ విద్యాలయ సంఘటన డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనూరాధ...సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి గురువారం మండలంలోని వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం–కృష్ణగిరి జాతీయరహదారికి ఆనుకుని సర్వే నంబర్లు.713/3, 713/4, 496/2, 496/3లో మొత్తం..6.09 ఎకరాల భూమిని కేటాయించినట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, కేవీఎస్ అధికారులకు తెలిపారు. దీంతో వారు స్థలానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. తర్వాత అక్కడ నుంచి బయలుదేరి పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ ప్రాంగణంలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయ తాత్కాలిక భవనాన్ని పరిశీలించారు. తరగతుల నిర్వహణకు, పాఠశాల ప్రారంభానికి అనువుగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని, చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్...కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి వలసపల్లె పంచాయతీలో కేటాయించిన 6.09 ఎకరాల స్థలానికి సంబంధించి అడ్వాన్స్‌డ్ పొజిషన్‌కు సంబంధించిన పత్రాలను కేవీఎస్, హైదరాబాద్ రీజియనల్ ఆఫీస్, డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనూరాధలకు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ...కేంద్రీయ విద్యాలయం, మదనపల్లెలో 2025–26 విద్యాసంవత్సరం నుంచి మొదటగా 1 నుంచి 5 తరగతుల వరకు కార్యకలాపాలను ప్రారంభిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది 6వతరగతి, మరుసటి సంవత్సరం 7 ఇలా పెంచుకుంటూ వెళతామన్నారు. అడ్మిషన్లకు సంబంధించి ఆఫ్‌లైన్ నోటిఫికేషన్‌ను వారం, పదిరోజుల్లో ప్రకటిస్తామన్నారు. వలసపల్లెలో శాశ్వత భవనాల నిర్మాణం పూర్తయ్యాక, పాఠశాలను పూర్తిస్థాయిలో అక్కడి నుంచే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట బీజేపీ పార్లమెంటరీ అధ్యక్షుడు సాయిలోకేష్, కేంద్రీయ విద్యాలయ తిరుపతి సబ్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, తహసీల్దార్ ధనంజయులు, ఆర్‌ఐ భరత్‌రెడ్డి, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎంపీ కృషి

మదనపల్లెను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి...వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజంపేట పార్లమెంటరీ పరిధిలో ఏర్పాటుచేయాలనుకున్న మెడికల్ కాలేజీని మదనపల్లెకు కేటాయించేలా చూశారు. బీటీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడమే కాకుండా, యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ తీసుకొచ్చారు. పేద పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యాలయాన్ని మదనపల్లెకు మంజూరు చేయించడమే కాకుండా వలసపల్లె పంచాయతీలో జాతీయరహదారికి ఆనుకుని 6.09 ఎకరాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. ఎంపీ నిధులు రూ.50లక్షలు మంజూరుచేసి, తాత్కాలిక భవన నిర్మాణపనులను పూర్తి చేయించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభం అవుతుండటంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయ స్థలం కబ్జా

- రూ.10 కోట్లతో అక్రమ నిర్మాణాలు
- జహా కాలనీ పేరుతో బోర్డు ఏర్పాటు
- సబ్ కలెక్టర్ పరిశీలనలో వెలుగులోకి



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె రూరల్ : ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురైంది. వేల కోట్ల రూపాయల విలువ కావడంతో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలు జరిపి ఆక్రమించారు. అధికారులు పరిశీలించడంతో అసలు విషయం వెలుగు చూసింది. మండలంలోని వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించారు. అనంతపురం–కృష్ణగిరి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలం ఖాళీగా ఉండడంతో కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు అడ్డుకునేందుకు వీలు లేకుండా జహా కాలనీ పేరుతో బోర్డు ఏర్పాటుచేసి పనులు చేస్తున్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్) డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనూరాధ, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ గురువారం ఆ స్థలం పరిశీలించేందుకు వెళ్లగా.. ఆక్రమణల విషయం వెలుగు చూసింది.

పనులు నిలిపివేయాలని ఆదేశం

కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన సర్వే నెంబర్0496/5 స్థలంలో కొంతమేర, రెవెన్యూ సర్వీసెస్ బిల్డింగ్‌కు సంబంధించిన సర్వే నెంబర్ 713/1, 2లో మరింత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. ఇదే కాకుండా.. కేంద్రీయ విద్యాలయం, హంద్రీ–నీవా కాలువకు ఆనుకుని ఉన్న రెండెకరాల స్థలం పదికోట్ల విలువ చేస్తుంది. ఇక్కడ దాదాపు వందకు పైగా పునాదులు వేసి పనులు సాగిస్తున్నారు. ఆక్రమణలను గుర్తించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ వెంటనే నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రికార్డులు ఉంటే చూపాలని సంబంధిత నిర్మాణదారులకు సూచించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని సర్వేయర్, ఆర్‌ఐలను ఆదేశించారు.

మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం

మదనపల్లె : ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు కోసం మండలాలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నమండెంకు డీఆర్‌డీఏ పీడీ, గాలివీడుకు డ్వామా పీడీ, గుర్రంకొండకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, కలకడకు జిల్లా పంచాయతీరాజ్ అధికారి, కంభంవారిపల్లెకు జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి, లక్కిరెడ్డిపల్లెకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, పీలేరుకు జిల్లా పరిశ్రమల అధికారి, రామాపురానికి జిల్లా దేవాదాయశాఖ అధికారి, రాయచోటి రూరల్‌కు జిల్లా పర్యాటకశాఖ అధికారి, రాయచోటి పట్టణానికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, సంబేపల్లెకు జిల్లా పంచాయతీ అధికారి, చిట్వేలికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి, కోడూరుకు జిల్లా భూగర్భ వనరులశాఖ అధికారి, నందలూరుకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ఓబులవారిపల్లెకు ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి, రాజంపేట రూరల్‌కు జిల్లా సహకార అధికారి, రాజంపేట పట్టణానికి డీఎల్‌డీఓ, టి.సుండుపల్లెకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి, వీరబల్లికి ఐసీడీఎస్ పీడీ, బి.కొత్తకోట పట్టణ, మండలానికి హెచ్‌ఎస్‌ఎస్‌ఎస్ ఎస్ఈ, కలికిరికి జిల్లా విద్యాశాఖ అధికారి, కురబలకోటకు జిల్లా పట్టుశాఖ అధికారి, మదనపల్లె రూరల్‌కు జిల్లా సచివాలయాల అధికారి, మదనపల్లె పట్టణానికి జిల్లా కార్మిక అధికారి, ములకలచెరువుకు జిల్లా ఉద్యానవన అధికారి, నిమ్మనపల్లెకు జిల్లా ప్రజారోగ్యశాఖ అధికారి, పెద్దమండ్యంకు జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, పీటీఎంకు జిల్లా సర్వే విభాగం ఏడీ, రామసముద్రంకు డీఎల్‌పీఓ, తంబళ్లపల్లెకు డీఎల్‌డీఓ, వాల్మీకిపురానికి ఏపీఎంఐపీ పీడీలను నియమించారు.

ఉపాధిలో 'చిలక్కొట్టుడు'!

బిల్లుల చెల్లింపులో ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం



ఉపాధి పనులకు వచ్చిన కూలీలు

గాలివీడు : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. కూలీలకు బిల్లులు చెల్లింపులో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు తెర తీశారు. నీకింత.. నాకింత అంటూ వాటాలు పంచుకున్నారు. గాలివీడు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో దాదాపు 14వేల జాబ్ కార్డుదారులు ఉన్నారు. వీరిలో 5వేల మంది పనులకు వెళ్తున్నారు. వీరి అవసరాలు ఆసరాగా తీసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లు వారు పనులకు వెళ్తే ఓ రేటు.. వెళ్లకుంటే మరో రేటు పెట్టి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మస్టర్లలో పేరు నమోదు మొదలు బిల్లులు చెల్లింపు వరకూ వారి కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఖాతాలో పడిన వెంటనే..

ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్ కార్డులు కలిగిన తమ అనుకూల ఉపాధి కూలీలను ఎంపిక చేసుకుంటున్నారు. ఉపాధి బిల్లు మొత్తం బ్యాంకు ఖాతాలో పడిన వెంటనే కూలీ తన అకౌంట్ నుండి తీసి ఎఫ్‌ఏలకు ఇవ్వాలి. దీనికి ఒప్పుకున్న వారి పేర్లు మాత్రమే ఉపాధి మస్టర్లలో చేరుస్తున్నారు. గ్రూపులుగా ఏర్పాటుచేసుకుని పనికి వెళ్లే వారైతే.. బిల్లు మొత్తం ఖాతాలో పడిన వెంటనే ఒక్కొక్క కార్డుదారుడు రూ.200 ఫీల్డ్ అసిస్టెంట్ కు ఇవ్వాలి. పనికి వెళ్లని వారైతే .. తమ ఖాతాలో బిల్లు జమ కాగానే 50 శాతం నగదు ఫీల్డ్ అసిస్టెంట్‌కు ముట్టజెప్పాల్సిందే. ఈ లెక్కన ఫీల్డ్ అసిస్టెంట్లు అప్పనంగా సొమ్ము ఆర్జిస్తున్నారు. ఇలా ఒక్కో పనికి రూ.20 వేల నుంచి రూ.30 వేలు సంపాదిస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఉపాధి అక్రమాలపై దృష్టి సారించి అక్రమ వసూళ్లను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా పట్టివేత

- వివిధ ప్రాంతాల్లో 17 చోట్ల చోరీలు
- బంగారు నగలు, వెండి స్వాధీనం
- జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ బంగారం, వెండి దోచుకెళ్లిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అన్నమయ్య జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి కిలో బంగారం, మూడు కిలోల వెండి, నగదు స్వాధీనం చేసుకున్నారు. రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు విలేకరులకు ఆ వివరాలు గురువారం వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా కోయలగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివ భవానీ (33) గతంలో విజయవాడ, బందర్, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి గూడెం, హనుమాన్ జంక్షన్, కోయిలగూడెం, రాజమండ్రి, తుని, అనకాపల్లి, చీపురుపల్లి ప్రాంతాలలో చోరీలకు పాల్పడ్డారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 150 కేసులలో అరెస్టయి జైలు శిక్ష అనుభవించి ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారన్నారు. బయటకు వచ్చిన వెంటనే చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవారిపల్లికి చెందిన జెట్టి సుబ్రహ్మణ్యం(27), అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మాధవరం పోడు గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకటేష్(21)లతో పరిచయం పెంచుకుని చోరీలు చేయడం మొదలు పెట్టారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రాంతాలలో వీరు దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వీరిపై బొమ్మూరు, నక్కలపల్లి, తిరుచానూరు పీఎస్‌లలో ఐదు, పీలేరు పీఎస్‌లో రెండు, రాయచోటి అర్బన్, రాజంపేట అర్బన్ పీఎస్‌లలో రెండు, ఓబులవారిపల్లి, మన్నూరు అర్బన్ పీఎస్‌లో 4 కేసులు గతంలో నమోదయ్యాయని అన్నారు. ఊటుకూరు సంజీవరాయ స్వామి దేవాలయం వద్ద ఈ నెల 21న వారిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి కోటి రూపాయలు విలువచేసే కిలో బంగారం, మూడు కిలోల వెండి, రూ.1.40లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మరింత బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీ, ఇతర వ్యక్తుల వద్ద రికవరీ చేయాల్సి ఉందన్నారు. కేసు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, మన్నూరు అర్బన్ సీఐ ఎస్.కుళాయప్ప, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్, ఓబులవారిపల్లి ఎస్‌ఐ పి.మహేష్, సీసీఎస్ ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్ నాయుడును అభినందించారు.

మైనర్ బాలికపై అత్యాచారం

వేముల : మైనర్ బాలికపై అత్యాచారం కేసులో మండలంలోని వి.కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ మైనర్ బాలికపై శివప్రసాద్ అత్యాచారం చేసినట్లు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిండు చూలాలిని చూడకనే.. తండ్రి మృతి

- కుమార్తె కోసం కువైట్ నుంచి వస్తూ విదేశాల్లో చనిపోయిన తండ్రి
- రూ.2.5 లక్షలు కడితే మృతదేహం ఇస్తామన్న ఆస్పత్రి నిర్వాహకులు



కన్నీటి పర్యంతమైన కుమార్తె మౌనిక

రాజంపేట: నిండు చూలాలైన తన కుమార్తెకు కాన్పు చేయించేందుకు విదేశాల నుంచి బయలుదేరిన తండ్రి.. ఆస్పత్రి పాలై కానరాని లోకాలకు చేరారు. మృతదేహం కావాలంటే రూ.2.5 లక్షలు కట్టాలంటూ కొలంబో ఆస్పత్రి వారు చెప్పడంతో కడచూపుకైనా నోచుకోలేకపోతున్నామని తల్లి, కుమార్తెలు కన్నీరు మున్నీరవుతున్నారు. రాజంపేటలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం చక్రంపేటకు చెందిన రాజుబోయిన మనోహర్(45) రాజంపేట పట్టణంలోని రామనగర్‌లో నివాసముంటున్నారు. బ్రతుకు దెరువు కోసం ఎనిమిది నెలల కిందట కువైట్‌కు వెళ్లారు. ఇతడికి భార్య రాజేశ్వరి, కుమార్తె మౌనిక, కుమారుడు ఉన్నారు. కుమార్తె నిండు చూలాలు కావడంతో బిడ్డకు కాన్పు చేయించేందుకు తండ్రి ఈ నెల 17న ఇండియాకు వచ్చేందుకు కువైట్ విమానాశ్రయంలో బోర్డింగ్ తీసుకున్నారు. అక్కడ శ్రీలంక విమానం ఎక్కినా.. ఇంటికి రాలేదు. దీంతో ఆయన భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించగా మనోహర్‌కు విమానంలో ఆరోగ్య సమస్య తలెత్తడంతో కొలంబో ఆస్పత్రిలో చేర్చారని, కోలుకోలేక అక్కడే మృతి చెందారని సమాచారం వచ్చింది. విషయం తెలుసుకుని భార్య, పిల్లలు బోరున విలపించారు. కడచూపుకైనా నోచుకుందామని అడిగితే.. రూ.2.5 లక్షలు కడితే మృతదేహంఇస్తామని కొలంబో ఆస్పత్రి సిబ్బంది చెప్పడంతో నిశ్చేష్టులయ్యారు. ఏమి చేయాలో తోచక ఇంటి వద్దే కన్నీరు మున్నీరవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మనోహర్ మృత దేహాన్ని ఇండియాకు తెప్పించాలని వారు కోరుతున్నారు.

వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ చోరీ



చోరీ జరిగిన ప్రదేశంలో బాధిత రైతులు

గుర్రంకొండ : నాలుగు వ్యవసాయ బోర్లు, బావుల వద్ద వరుస చోరీలు జరిగిన సంఘటన మండలంలోని టి.రాచపల్లెలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన నలుగురు రైతులు గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం తమ పొలాల వద్దకు వెళ్లారు. కేబుల్ వైర్లు కత్తిరించి.. ఫీజు క్యారియర్లు బయటపడి ఉండడంతో వ్యవసాయ పరికరాలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. గ్రామానికి చెందిన రమేష్‌బాబు పొలంలో 30మీటర్ల కేబుల్, సురేంద్రరెడ్డి పొలంలో 50 మీటర్లు, రఘునాథరెడ్డి పొలంలో 45 మీటర్లు, సిద్దమల్‌రెడ్డి పొలంలో 25 మీటర్ల కేబుల్ వైర్లు, ఫీజు కారియర్లు దోచుకెళ్లారు. రమేష్‌బాబు పొలంలో రూమ్ తాళాలు పగులగొట్టి అందులో వ్యవసాయ పరికరాలు, సామగ్రి తీసుకెళ్లారు. చోరీకి గురైన వస్తువులు, కేబుళ్ల విలువ లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో జైలు శిక్ష

ఓబులవారిపల్లె : మండలంలోని కొర్లకుంట, మంగంపేట అగ్రహారంలో స్కూటర్, ఆటో చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ రైల్వేకోడూరు మెజిస్ట్రేట్ తేజసాయి తీర్పు చెప్పారు. కొర్లకుంట క్రాస్ రోడ్డులో లవనూరు దామోదర్ ఉంచిన మోటారు సైకిల్‌ను సత్యసాయి జిల్లా కామసముద్రం గ్రామానికి చెందిన పటాన్ సాహెబ్ చోరీ చేశారు. మంగంపేట అగ్రహారానికి చెందిన పసుపులేటి బాలాజీ ఆటోను ధర్మవరం వద్ద శివశంకరాచారి తీసుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి సదరు వాహనాలను రికవరీ చేశారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపరచడంతో మెజిస్ట్రేట్ తేజసాయి రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ కేసులో శిక్ష పడటానికి కృషి చేసిన ఓబులవారిపల్లి ఎస్‌ఐ పి మహేష్, కోర్టు కానిస్టేబుల్ వెంకటయ్యలను ఉన్నతాధికారులు అభినందించారు.

రాబోయేది.. జగనన్న ప్రభుత్వమే

మాజీ డీఓపీ జల్లా సుదర్శన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డీఓపీ జల్లా సుదర్శన్‌రెడ్డి

గాలివీడు : మళ్లీ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రాష్ట్ర మాజీ డీఓపీ జల్లా సుదర్శన్ రెడ్డి అన్నారు. స్థానిక సాయిమేఘన పెట్రోల్ బంక్ వద్ద జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్, తదితరులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, మారుమూల ప్రాంతాలకు వెళ్లినా జగనన్నే కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి కుటుంబంలో వెలుగులు నింపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. విద్య, వైద్యం కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టారని, కరోనా విపత్కర సమయంలోనూ ప్రజలను ఆదుకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిరాల భానుమూర్తి రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామాంజులు రెడ్డి, ఉమాప్రభాకర్, వల్లెపు నగేష్, రమణారెడ్డి, జల్లా ధనుంజయరెడ్డి, వెంకటరెడ్డి, అమీన్, తదితరులు పాల్గొన్నారు.

కంచె పోయె... కటవ వచ్చె



చెయ్యేరు వంతెన (ఎన్‌హెచ్‌ఏఐ) దగ్గర రక్షణగా కట్టలు పెట్టిన రైతులు

పై చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం.. పంటపొలాల వద్ద పశువులు, మేకలు రాకుండా రైతులు వేస్తున్న రక్షణ కంచె అనుకుంటే పొరపాటే. కడప–రేణిగుంట రహదారిపై నందలూరు చెయ్యేరు వంతెన(నందలూరువైపు) ప్రవేశ మార్గంలో ఇనుప కంచెలు ఎప్పుడో పోయాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనాలు పడితే నేరుగా పొలాల్లోకి వస్తాయనే ఆందోళనతో రైతులే స్వయంగా ఇలా కటవ వేసుకున్నారు. దాంతోపాటు పశువులు, మేకలు పొలాల్లోకి రాకుండా ఉంటాయని రైతులు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలే రక్షణ కటవ వేసుకోవాల్సి వచ్చిందనడానికి ఈ దృశ్యం అద్దం పడుతోంది. – రాజంపేట



ఎన్‌హెచ్‌ఏఐ (కడప–రేణిగుంట) రహదారిలో ముళ్లపొదలతో కటవ వేసుకుంటున్న రైతులు